బైపాస్ రోడ్డుతో మహర్దశ


కేశవపట్నం వాగుపై బ్రిడ్జి పనులు


కేశవపట్నం వాగు

- కేశవపట్నం వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు
- తీరనున్న రైతుల ఇబ్బందులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం వాగుపై జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. కేశవపట్నం గ్రామ రైతులు వాగు అవతలివైపు పొలాల వద్దకు వెళ్లేందుకు కేశవపట్నం గ్రామం నుంచి మెయిన్‌రోడ్డు నుంచి ఆరు కిలోమీటర్లు తిరిగి వెళ్లేవారు. ముప్పై ఏళ్లుగా రైతులు బ్రిడ్జి నిర్మించాలని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులకు మొరపెట్టుకున్నారు. మూడు దశాబ్దాలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. బైపాస్ రోడ్డుతో మెజార్టీ రైతుల ఇబ్బందులు తీరనున్నాయి. కేశవపట్నం వాగుపై నుంచి పంటపొలాల వద్దకు వెళ్లేందుకు అనువుగా బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఫ్లైఓవర్, రెండు వైపులా సర్వీస్‌రోడ్డుతో పంట పొలాలకు వద్దకు వెళ్లేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి.

జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జామ్


తాడికల్ శివారులో జాతీయ రోడ్డుపై వాహనాలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులో జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడంతో వన్‌వేపై ట్రాఫిక్ జామ్ అయింది. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండలంలోని తాడికల్ గ్రామశివారులో వన్‌వేపై వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. సోమవారం వన్‌వేపై లారీ నిలిచిపోయింది. మరో చోట మరోలారీ ఆగిపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో భారీ ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న కేశవపట్నం ఎస్సై రవి సిబ్బందితో తాత్కాలిక మార్గం ఏర్పాటు చేయించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.



చొప్పదండి: మండలంలోని రెవెళ్లి పెద్ద చెరువు కట్టపై నిర్మించిన మినీ ట్యాంకు బండ్ నామరూపాల్లేకుండా పోతోంది. కట్టపై నిర్మించిన సైడ్‌బర్మ్‌లు సర్కారు తుమ్మలతో నిండిపోయాయి. కనీసం వాకింగ్‌కు కూడా ఉపయోగం లేకుండా పోవడంతో మినీ ట్యాంకు బండ్ ప్రయోజనాలు ప్రజలకు అందడం లేదు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో, చొప్పదండి, సెల్ నంబర్: 9951832435

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

గన్నేరువరంలో బీజేపీ నాయకుల ప్రచారం


ఎన్నికల ప్రచారంలో నాయకులు

గన్నేరువరం: కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మద్దతుగా మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్ల ఇంటికి వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. శాసనమండలిలో పట్టభద్రుల సమస్యలను వినిపించడానికి అంజిరెడ్డికి మద్దతు ఇవ్వాలని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం బీజేపీతో సాధ్యమని, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మానసాదేవి ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్‌చార్జి పుల్లెల రాము, మచ్చ బాలరాజు, బీజేవైఎం నాయకులు వినయ్, చందు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డికి మద్దతుగా..


ప్రచారం చేస్తున్న నాయకులు

గంగాధర: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా సోమవారం మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉన్న నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో నాయకులు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, వెలిచాల తిర్మల్‌రావు, రాజగోపాల్‌రెడ్డి, వేముల భాస్కర్, తోట కరుణాకర్, పురమల్ల మనోహర్, సత్తు కనుకయ్య, బూర్గు గంగన్న, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, అట్ల శేఖర్‌రెడ్డి, కరుణాకర్, సతీష్, మధు, పడిదపల్లి కిషన్, వేముల అంజి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని లక్ష్మీనగర్‌లో పైప్ లైన్ లీకేజీకి మరమ్మతు చేపట్టారు. కమాన్ చౌరస్తా నుంచి పెద్దపల్లి బైపాస్‌కు వెళ్లే మెయిన్ రోడ్డుపై ఎంఐఎం కార్యాలయం వద్ద పైప్‌లైన్ లీకేజీ సమస్యను లక్ష్మీనగర్‌కు చెందిన రెహమాన్ 'సాక్షి వాట్సాప్' ద్వారా సోమవారం వెలుగులోకి తీసుకువచ్చారు. స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు మరమ్మతు చేయించారు. కాగా, సమస్య శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



కరీంనగర్ రూరల్: బొమ్మకల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. హోమం, సుదర్శన యాగం, ఎల్లమ్మ కల్యాణం తదితర కార్యక్రమాలు చేపట్టారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల శ్రీనివాస్, మానకొండూరు ఇన్‌చార్జి నవీన్, మండల అధ్యక్షుడు బూస శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆరోగ్యమేళా


ఇల్లందకుంట: క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్, వైద్య సిబ్బంది

ఇల్లందకుంట: క్షయవ్యాధి బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ తుల సీదాస్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో సోమవారం క్షయవ్యాధిపై ఆరోగ్యమేళా కార్యక్రమం నిర్వహించి ప్రజలకు క్షయవ్యాధి (టీబీ)పై అవగాహన కల్పించారు. వ్యాధిగ్రస్తులకు, వారితో సన్నిహితంగా ఉండే కుటుంబసభ్యులకు, పోషకాహార లోపం ఉన్నవారు, అరవై ఏళ్లు పైబడిన, పొగ, మద్యపానం సేవించే వారికి స్క్రీనింగ్ చేసి తెమడ నమూనాలు సేకరించారు. టీబీ నిర్ధారణయితే రోగికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. చికిత్స తీసుకునే కాలంలో పోషకాహారం కోసం ప్రతినెలా ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లా రూ. వెయ్యి చొప్పున జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో డా. కళ్యాణ్, దేవేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాస్, మానస, రోజారాణి, ఆశ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు

ఆరోగ్యంపై మహిళలు దృష్టి పెట్టాలి

హుజూరాబాద్: మహిళలు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెడితే ఎలాంటి రోగాలు దరిచేరవని హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహిళా స్వయం సహాయక బృందాలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఉపయోగించుకొని ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ పంజాల ప్రతాప్, హెల్త్ అసిస్టెంట్ సత్యం, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ చందు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలను ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో డాక్టర్ సుధాకర్‌రావు, ఏవో డాక్టర్ నారాయణరెడ్డి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


గంగాధర: కరాటే పోటీల్లో సాధించిన పతకాలతో మల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

విద్యార్థులకు అభినందన

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి పాఠశాల విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో అమిరిశెట్టి మనుశ్రీ ఎనిమిదో ర్యాంకు సాధించగా జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన అక్కినపల్లి తనుశ్రీ, ప్రమోద్‌కుమార్, వేముండ్ల హాసినిని స్కూల్ కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ సోమవారం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మునీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మంద తిరుపతి, సహారాబాలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో రెండోస్థానం

శంకరపట్నం: కేరళలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచిందని కోచ్, వెంకటేశ్వర్లపల్లి పాఠశాల హెచ్‌ఎం లక్కాకుల కోటేశ్వర్‌రావు సోమవారం తెలిపారు. కరీంనగర్‌కు చెందిన ఆమని మహిళల విభాగంలో ప్రశంసాపత్రాన్ని యోగా అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు ఇందుఅగర్వాల్ చేతుల మీదుగా అందుకున్నట్లు కోటేశ్వర్‌రావు వివరించారు. రాష్ట్ర కార్యదర్శి సిద్దారెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

చిగురుమామిడి: శ్రీపాదరావు మెమోరియల్ కప్‌లో భాగంగా మండలకేంద్రలోని ఓ ప్రైవేట్ హైస్కూల్ విద్యార్థి బండారిపల్లి ఇషాన్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. గత ఆదివారం నిర్వహించిన పోటీల్లో స్పారింగ్ విభాగంలో కూడా మూడో స్థానంలో నిలిచి పతకం సాధించాడని స్కూల్ కరస్పాండెంట్స్ కె.సమ్మిరెడ్డి, దమయంతి అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ బండారుపల్లి రమేశ్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


ఇషాన్‌ను అభినందిస్తున్న సమ్మిరెడ్డి


ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆమని, వెంకటేశ్వర్‌రావు


విద్యార్థులను అభినందిస్తున్న రాధాకృష్ణ

గంగాధర: మండలంలోని మల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి తెలిపారు. స్పార్క్ కుంగుఫూ, మార్షల్ ఆర్ట్స్ కరాటే అకాడమీ వారు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో అజిత్‌కుమార్, అరుణ్‌కుమార్ కటాస్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవగా జూనియర్స్ విభాగంలో ప్రణయ్ తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో సోమవారం సైబర్ మోసాలపై పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పరిచయంలేని వారికి ఎలాంటి ఓటీపీలు చెప్పొద్దని, సెల్‌ఫోన్ వల్ల కలిగే ఇబ్బందుల గుర్చి తెలియజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జమ్మికుంట: పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పట్టణంలో జరిగింది. శంకరపట్నం మండలం మొలంగూరు గ్రామానికి చెందిన స్వర్ణలతకు (38)జమ్మికుంటకు చెందిన గుర్రాల ప్రభాకర్‌తో 15ఏళ్ల క్రితం వివాహమైంది. సీడ్ బిజినెస్‌లో ప్రభాకర్‌కు నష్టం రాగా అప్పుల పాలయ్యాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన స్వర్ణలత ఈ నెల 16న తన ఇంట్లో పురుగు మందు తాగింది. కుటుంబీకులు గమనించి వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తల్లి వజ్రమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ రవి తెలిపారు.

కేసు నమోదు

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన బత్తిని సాగర్‌పై అదే గ్రామానికి చెందిన గోపగాని రవి సోమవారం కత్తితో దాడి చేసి గాయపరిచాడు. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు... రవి, సాగర్ దారి విషయమై సోమవారం గొడవపడ్డారు. కోపానికి గురైన రవి సాగర్‌పై కొడవలితో దాడి చేయగా తలకు తీవ్రగాయమై రక్తస్రావమైంది. వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకూ రవిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కరీంనగర్ రూరల్: వేసవి కాలంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా తీగలగుట్టపల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎస్‌ఈ రమేశ్ సోమవారం ప్రారంభించారు. డీఈ రాజం, ఏఈ సేవినాయక్ పాల్గొన్నారు.

డిజిటల్ విద్యాబోధనపై శిక్షణ

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జెడ్పీ కాంప్లెక్స్ పాఠశాలలో సోమవారం హిందీ ఉపాధ్యాయులకు డిజిటల్ విద్యాబోధనపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో రవీందర్ మాట్లాడుతూ.. డిజిటల్ పాఠాలు విద్యార్థులకు సులభంగా అర్థమవుతాయన్నారు. అనంతరం దుర్శేడ్ కాంప్లెక్స్ పాఠశాలలో తెలుగు భాషలో ఐఎఫ్ సీ ఉపయోగించడంపై అవగాహన కల్పించారు. కరీంనగర్, చొప్పదండి మండలాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్‌రూరల్: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం నీరుకుల్ల మానేరువాగు నుంచి గర్రెపల్లి మీదుగా ఇసుక ట్రాక్టర్లు వస్తున్నాయన్న సమాచారంతో బ్లూకోల్ట్స్ పోలీసులు చెర్లభూత్కూర్ వద్ద తనిఖీ చేపట్టారు. ఒక ట్రాక్టర్ పట్టుబడింది. బొమ్మకల్‌లో మానేరు వాగు నుంచి వస్తున్న మరో ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని, రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'నా భూమి నాకు ఇప్పించండి'

విద్యానగర్: తన భూమిని కరీంనగర్‌కు చెందిన దాసరి బుచ్చిమల్లారెడ్డి కబ్జా చేసి, ఇబ్బ ందులకు గురిచేస్తున్నాడని ఓ వ్యక్తి ఆరోపించాడు. సోమవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ఆయన వివరాల ప్రకా రం.. కరీంనగర్‌కే చెందిన లింగంపల్లి అంజ య్యకు నగరంలోని అంబేడ్కర్ స్టేడియం ఎదురుగా సర్వే నంబర్ 291, 292లలో ఎని మిదిన్నర గుంటల భూమి ఉంది. ఇందులో ఐదున్నర గుంటలను బుచ్చిమల్లారెడ్డి కబ్జా చేసి, 20 ఏళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నా డు. అంజయ్య తన తల్లి లక్ష్మి నుంచి 2004లో గిఫ్ట్ డీడ్ పొంది, ఇంటి నిర్మాణానికి దరఖా స్తు చేసుకున్నా అధికారులు అనుమతి ఇవ్వ డం లేదు. బుచ్చిమల్లారెడ్డి తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి, మున్సిపల్‌లో దరఖాస్తు చేస్తే అతనికి పర్మిషన్ ఇచ్చారు. ఈ విషయ మై పోలీసులను ఆశ్రయిస్తే చర్యలు తీసుకో వడం లేదని అంజయ్య ఆవేదన వ్యక్తం చేశా డు. తన భూమిని ఇప్పించాలని కోరాడు.

ఉపకాల్వకు మరమ్మతులు


మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

గన్నేరువరం: గన్నేరువరంలో మిడ్‌మానేర్ ఉపకాల్వకు సోమవారం మరమ్మతు పనులను సోమవారం చేపట్టారు. మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వ అనుసంధానంగా ఉపకాల్వ 8ని సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూరు నుంచి మండలంలోని ఖాసీంపేట, చాకలివానిపల్లె, గన్నేరువరం, యాస్వాడ వరకు నిర్మించారు. దీని ద్వారా పంట పొలాలకు మిడ్‌మానేరు నుంచి సాగునీరు ఏడాదిగా అందిస్తున్నారు. ప్రస్తుతం కాల్వ పిచ్చిమొక్కలతో పాటు మట్టితో పూడుకుపోవడంతో సాగునీరు సరఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు సమస్యను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు కాల్వ మరమ్మతు పనులను డీసీసీ కార్యదర్శి బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో చేపట్టారు. కాల్వ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించనున్నామని తెలిపారు. పనులు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జాలి లింగారెడ్డి కొలుపుల వేణు, జాలి నరేష్, కయ్యం మహేష్, సైండ్ల సాయి, కుమ్మరి కనుకయ్య, రామంచ రాజయ్య, తాళ్లపల్లి కొమురయ్య, వేదిర అంజయ్య, నితిష్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


ప్రశాంత్ భవన్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడక్కడ అన్నదానం నిర్వహించారు. రామడుగు మండలం వెలిచాల గ్రామ పరిధి ప్రశాంత్‌భవన్‌లో విద్యార్థులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. ప్రశాంత్‌భవన్‌కు అవరసమైన నిత్యావసర సరుకులు అందజేశారు. గంగాధర మండలంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో పాటు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. మధురానగర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. ఏ పథకం అమలు కావడం లేదని, ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణ శివారులోని కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలంటూ ప్రత్యేక హోమం నిర్వహించారు. రాష్ట్ర సాధనలో, పదేళ్ల పాలనలో కేసీఆర్ పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో, అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేశారు. పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటారు. మానకొండూర్ మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. బాలికల హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.


తిమ్మాపూర్: జన్మదిన వేడుకల్లో రమేశ్, దేవేందర్‌రెడ్డి

'బీజేపీ అభ్యర్థికి లాభం చేసే కుట్ర'



మాట్లాడుతున్న అబ్దుల్ రెహమాన్

కరీంనగర్ కార్పొరేషన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైనార్టీ ఓట్లు చీల్చి, బీజేపీ అభ్యర్థికి లాభం చేకూర్చేందుకు కుట్ర జరుగుతోందని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ఆరోపించారు. సోమవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి పడాల్సిన మైనార్టీ ఓట్లను చీల్చేందుకు స్వతంత్ర అభ్యర్థి ముస్తాక్ అలీ పోటీలో ఉన్నారన్నారు. ఆయన నామినేషన్ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు పాల్గొనడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అలీ తన అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ మహమ్మద్ ఆమెర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.